# అనురాగం

ఆమె పేరు ఊర్వశి. ఆమె నాస్నేహితుని భార్య.

చాలా మమూలుగా కనిపించే ఆరెండు వాక్యాలే ప్రస్తుతం నేననుభవించే చిత్రవధకి కారణాలు.

అవును. ఆమె ఊర్వశి.

అమృతం తాగిన అప్సరస. వెన్నెలతో పాటూ పుట్టిన మెరుపుతీగ. నానరనరాన్నీ తన ఆకర్షణతో మెలితిప్పే విద్యుల్లత.

కానీ.. కానీ.. ఆమె నాస్నేహితుని భార్య. నేనెన్నటికీ అందుకోలేని అగ్నికీల.

దాదాపు సంవంత్సరం క్రితం.. రవి దగ్గరనుంచి ఉత్తరం వచ్చిన రోజు.. ఆరోజు నాకు తెలీదు.

నా జీవితంలో రాబోయే మార్పు గురించి ఆరోజు నాకు తెలీదు.

తనకి ట్రాన్స్ ఫర్ అయ్యిందనీ.., భార్యా పిల్లలతో ఈ వూరొస్తున్నాననీ.., ఒక యిల్లు చూసిపెట్టమనీ .. రవి వ్రాసిన ఉత్తరం చదువుకుని చాలా ఆనందించాను నేనారోజు.

"ప్రక్క యిల్లే ఖాళీగా వుంది. వెంటనే బయల్దేరి రా!" అంటూ రిప్లై యిచ్చాను.

స్టేషన్ కి వెళ్ళి వాళ్ళని రిసీవ్ చేసుకోవడం... నేను మొట్టమొదటి సారి ఆమెను చూసిన ఆ క్షణం.. నాకిరోజుకీ అంతే కొత్తగా, అంతే అద్భుతంగా అనిపిస్తుంది.

ముందు పిల్లలూ.. తర్వాత రవీ.. ఆతర్వాత అతని చేయి పట్టుకుని, అతని భుజం మీద సుతారంగా తన బరువు ఆన్చి ఊర్వశి రైలు దిగడం. ఇప్పటికీ నాకళ్ళముందు అలాగే నిలుస్తుంది ఆదృశ్యం.

ఆ రైలూ.. స్టేషనూ.. మురికి మురికిగా వున్న ఆ వాతావరణంలో నుంచి మెరుపుతీగలా ఆమె నడచి రావడం.

ఆరోజుతో నా ప్రశాంతత చెదరిపోయింది. అప్పట్నుంచి ప్రతిరోజూ.. ప్రతిక్షణమూ ఆమె నా హృదయాన్ని చిత్రవధ చేస్తూనే వుంది. ఇంకొన్నాళ్ళు యిలాగే సాగితే ఆమె మీద ఆకర్షణతో నాకు మతిభ్రమిస్తుందేమోననిపిస్తోంది.

ఈ యిల్లు మారిపోదామనీ.. ఆమెకి దూరంగా పారిపోదామనీ అనుకున్నాను. కళ్ళెత్తి ఆమెని చూడకూడదనుకున్నాను. కానీ అనుకున్నవేవీ ఆచరించలేకపోయాను.

ప్రతిరోజూ సాయంత్రం ఆఫీసు నుండి రాగానే. . డాబా మీద ఈమూల కుర్చీ వేసుకుని కూర్చోవడం. . వాళ్ళ సంసారాన్ని గమనించడం. . నాప్రమేయం లేకుండానే జరిగిపోయే పనులు.

పిల్లాడికి నాలుగేళ్ళు. . పిల్లకి రెండేళ్ళుంటాయేమో! ఇద్దరు పిల్లలున్న తల్లి యింత ఆకర్షణీయంగా వుండడం అసలెలా సాధ్యం! ఆమె అప్సరస కాకపోతే!

"కిరణ్! ఒరేయ్ కిరణ్!" రవి కేకలకి ఉలికిపాటుగా చూశాను. లేచి వెలుతురులోకి వచ్చి నిలబడ్డాను వాడికి కనపడేలా.

"ఏం చేస్తున్నావ్! ఇలారా. టిఫిన్ చేద్దాం."

ఆమె నవ్వుతూ చూస్తోంది అతని భుజంమీదుగా. "రండి. పూరీలు చేశాను." అరిచింది.

"వద్దులెండి" అనాలనుకున్నాను.

గొంతులోనుంచి మాట రాలేదు.

మెల్లగా మెట్లుదిగి వాళ్ళవైపు నడిచాను.

ఆమె ప్లేట్ అందించింది. యాంత్రికంగా అందుకున్నాను. కానీ నోటికి రుచి తెలుస్తుందా! ఆమెని చూస్తుంటే ఆకలీ దాహమూ అర్ధమవుతాయా!

"ఇంక చాలు." రవి చేయి అడ్డం పెడుతూ అన్నాడు.

"అబ్బ! తినండీ!" చిరుకోపంగా అంటూ మరో రెండు వడ్డించింది.

"నాకు తెలుసులే నీ కుట్ర. నేను లావు అవ్వాలనీ, మా ఫ్రెండ్సనీకి నామీద అట్రాక్షన్ తగ్గిపోవాలనీ నీ ప్లాన్"

రవి మాటలకి చిన్నగా నవ్వింది ఆమె.

"నవ్వుతావేంటి? నిజం. మీలాంటి భర్త దొరకడం నిజంగా ఊర్వశి గారి అదృష్టమండీ! అంటుంది తెలుసా!" రవి గొప్పగా చెప్పాడు.

నేను నవ్వాను. "ఆమాట ఆవిడ చెప్తే ఎలా! ఊర్వశి చెప్పాలి." అన్నాను.

"కరెక్ట్" అంది ఆమె. "నేనెపుడూ చెప్పలేదు కిరణ్ ఈయనతో ఆమాట. నాకలా అనిపించలేదు కూడా."

అల్లరిగా నవ్వుతోంది ఆమె. ఎంత మధురంగా వుంటుంది కిరణ్ అన్న పిలుపు ఆమె నోటివెంట వస్తే!

నేను కన్నార్పకుండా చూస్తూండి పోయాను.

రవి అలుక నటిస్తూ అన్నాడు. "అవున్లే! నువ్వెందుకు చెప్తావు! నీకసలు నావిలువ తెలిస్తేగా!"

గలగలా నవ్వింది ఆమె. "విలువ తెలిక కాదు స్వామీ! విలువని కరెక్ట్ గా అంచనా వేయగల ప్రతిభ వుండబట్టి. ఎవరిని పడితే వాళ్ళని మెచ్చుకుంటామేమిటి? క్రిష్ణశాస్త్రి కవిత వ్రాస్తే కరిగి పన్నీరవుతాం. మన ఎదురింటి అప్పారావు అయితే వింటామా! అలాగే మీరూను. మీప్రతిభ నాకు కదా తెలుసు!" చివరిమాట చిన్నగా, వినీవినపడనట్లుగా. నవ్వుని నొక్కిపడుతూ అంది.

పాపం రవి మొహం నల్లగా మాడిపోయింది. నేను తలవంచుకుని నవ్వాపుకున్నాను. చేయి కడుక్కోవడానికి లేస్తూ "పిల్లలు పడుకున్నారా!" అన్నాను.

"ఆ! ఇప్పటివరకూ అల్లరిచేసి యిపుడే పడుకున్నారు." చెప్పాడు రవి. "రేపు వాళ్ళని పిక్నిక్ కి తీసుకెళ్ళాలట."

"ఎక్కడికి?"

"మద్రూరు వెళ్దామనుకుంటున్నాం. సముద్రం చూడాలని సరదా వాళ్ళకి." సృష్టిలోని వాత్సల్యమంతా గొంతులో మెరుస్తుండగా చెప్పాడు. "నువ్వూ వస్తావా!"

నేను సమాధానం చెప్పబోయాను.

"సెలవేగా! రండి. సరదాగా వెళ్దాం" అంది ఊర్వశి.

ఆమె చెప్పాక యిక కాదనేది ఏముంది! తలూపి వచ్చేశాను.

ఆలోచిస్తే చాలా చిత్రంగా అనిపిస్తుంది నాకు. చాలాసార్లు ప్రశ్నించుకుంటాను. ఈమెలో నన్ను యింతగా ఆకర్షిస్తూన్న అంశమేమిటి! అని, సమాధానం దొరకదు.

జీవితంలో ఎంతోమంది స్త్రీలను చూశాను. కాలేజీలో. ఆఫీసులో. నిజానికి వాళ్ళలో చాలామంది ఊర్వశికన్నా అందమైన వారేమో కూడా. అయినా ఎపుడూ. . ఎవరి విషయంలోనూ నాకిలాంటి బలహీనత కలగలేదు. ఇంతటి విపరీతమైన ఆకర్షణ కలగలేదు. ఏముంది ఈమెలో! ఏముంది!

అంతు దొరకని ఆలోచనల మధ్య ఎపుడు నిద్ర పట్టిందో!

తెల్లవారుతూండగానే రవి వచ్చి తలుపు కొట్టాడు. "ఏరా! బయల్దేరుతున్నావా!" అంటూ.

ఉలిక్కిపడి లేచాను. చకచకా రెడీ అయి బయటకి వచ్చేసరికి ఊర్వశి నవ్వుతూ నిలబడి వుంది. "మీదే ఆలస్యం. పదండి" అంటూ.

సముద్రం అంటే నాకు చాలా యిష్టం. సముద్రగర్భం కూడా ఊర్వశి అంత బలంగానూ ఆకర్షిస్తుంది నన్ను.

ఎగిరెగిరి పడే కెరటాలూ.. ఆ హెూరూ.. నీలిరంగులోని విషాదపు జీర.. దూరంగా అంత పెద్ద సముద్రాన్ని ఈదుకెళ్ళిపోయే చిన్నిపడవా.. అది కలిగించే ఉద్వేగపు హేల...

పిల్లలిద్దరినీ చెరోచేత్తో పట్టుకుని సముద్రం లోపలికి నడిచాను. నారెండు భుజాలపైనా కూర్చుని తలని గట్టిగా పట్టుకుని కేరింతలు కొడుతున్నారు వాళ్ళు.

ఓ కెరటం నిలువెత్తుగా రావడం.. నన్ను ఢీ కొని మెల్లగా జారడం.. మరో కెరటం.. మరో కె. ర. టం.. మ. రో. కె. ర. టం..!

ఎంతసేపైనా తనివితీరదు. అలుపురాదు.. సముద్రుడితో ఆటలు.

మధ్యలో వెనుతిరిగి చూస్తే.. రవీ, ఊర్వశీ దూరంగా కనిపించారు.. సముద్రం వడ్డునే. వాడు ఒక్కొక్క అడుగూ వేస్తున్నాడు. రెండుచేతుల్తో వాడి నడుముని గట్టిగా పట్టుకుని, వీపుమీద తల ఆన్చి, కళ్ళు భయంతో గట్టిగా మూసుకుంటూ ఆమె నడుస్తోంది.

వాడికీ భయమే. నడుములోతు నీళ్ళు దాటి యిద్దరూ రావడం లేదు.

నాకు వడివడిగా వడ్డుకి వెళ్ళాలనీ.. ఆమె చేయి పట్టుకుని సముద్రం లోపలికి తీసుకురావాలనీ అనిపించింది.

ఆమెని నా రెండుచేతులమధ్యా గట్టిగా బంధించి.., ఒక్కో కెరటమూ మాతలలమీదుగా పరుగెడుతూంటే.. భూమి మీద బలంగా కాళ్ళూన్చి.., వుద్వేగంతో ఆమె అరిచే అరుపుల్ని సముద్రపు హెూరుతోపాటూ నాపెదవుల మధ్య బంధించి.. ఎంత అద్భుతంగా వుంటుంది ఆఅనుభవం!

పెద్ద కెరటం మొహం మీద విసురుగా చరచడంతో నాకల కరిగిపోయింది.

పిల్లల్ని రెండు చేతుల్తోనూ పట్టుకుని, వడ్డువరకూ వచ్చాను. ఏదో ఉదాసీనతతో. విషాదంతో గుండె వణుకుతోంది.

వాళ్ళందరూ నవ్వుతూ తుళ్ళుతూ వున్నా.. నేను మాత్రం హుషారుగా వుండలేకపోతున్నాను. తలలో సన్నగా పోటు మొదలయింది.

పిల్లలు అలిసిపోయేవరకూ ఆడారు.

అందరం బావి దగ్గర స్నానాలు చేసి ఊర్వశి తెచ్చిన ఫలహారాలు తిని వెనుదిరిగాం. బస్ స్టాప్ వరకూ మెల్లగా నడుస్తూ వచ్చాం.

ఊర్వశి.., ఆవెనుక పిల్లల్ని పట్టుకుని రవి.., ఆతర్వాత నేనూ.. తాపీగా నడుస్తున్నాం.

హటాత్తుగా.. ఒక లారీ పెద్ద శబ్దంతో ప్రక్కరోడ్డులోనుంచి దూసుకు వచ్చింది.

కెవ్వుమన్న ఊర్వశి కేక ఆలారీ శబ్దంలో కలిసిపోయింది.

ఊర్వశి దాని క్రింద పడిపోయిందనే అనుకున్నాను నేను.

చివరిక్షణంలో రవి మెరుపులా వెళ్ళి ఆమెను ప్రక్కకి లాగాడు. ఇద్దరూ విసురుగా వెళ్ళి ప్రక్కనున్న రాయిమీద పడ్డారు.

రెండు క్షణాలవరకూ నాకసలేమీ అర్థం కాలేదు.

ఆతర్వాత తేరుకుని దగ్గరగా వెళ్ళి యిద్దరినీ లేపాను.

ఆమెచేయీ, వాడి కాలూ.. రెండూ రాయి దెబ్బకి పగిలి రక్తం కారుతున్నాయి.

గుక్కపట్టి ఏడుస్తూన్న పిల్లలిద్దరినీ నేను దగ్గరికి తీసుకుంటూంటే రవి నిస్త్రాణగా బండమీద కూలబడ్డాడు.

ఆమెని దగ్గరకి తీసుకుని కళ్ళలో నీరుబుకుతుండగా అన్నాడు "ఎంత గండం తప్పింది!"

ప్రక్కనే కూర్చుని వాడి భుజం మీద తల ఆన్చి దుఃఖం ఆపుకుంటోంది ఊర్వశి.

పిల్లలవైపే తదేకంగా చూస్తూ అంటున్నాడు రవి "నువ్వెళ్ళిపోతే నే రాలేకపోయేవాడిని కదా నీవెనుక!" వాడి కళ్ళల్లో యింకా నీళ్ళు తిరుగుతున్నాయి.

ఆమె నవ్వింది నీళ్ళు నిండిన కళ్ళతో. "చాల్లే. వూర్కోండి. మిమ్మల్నొదిలి నేనెక్కడికి వెళ్తానసలు!" అంది.

అపరాధభావంతో నా శరీరం నిలువెల్లా వణికింది.

అక్కడ్నుంచి యింటికి ఎలా వచ్చామో నాకు తెలీదు. తెల్లవారేసరికి విపరీతంగా జ్వరం. అయినా యింట్లో వుండదల్చుకోలేదు నేను. జ్వరంతోనే ఆఫీసుకెళ్ళిపోయాను.

వెళ్ళిన కాసేపటికి తెలిసింది. నాకు ట్రాన్స్ ఫర్ అయ్యిందని.

చిన్నగా నిట్టూర్చి దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. రెండోరోజుకల్లా వెళ్ళి క్రొత్తవూర్లో జాయిన్ అయ్యాను.

*****

రెండు నెలల తర్వాత...

ప్రొద్దున పూట ఆఫీసులో సీరియస్ గా వర్క్ చేసుకుంటూండగా వచ్చింది ఆ వార్త.
"ఏరా కిరణ్! మీఫ్రెండ్ రవి పోయాడట గదరా!" సత్యనారాయణ మాటలకి ఉలిక్కిపడ్డాను.
"ఏ రవీ!"
"నీ ఫ్రెండ్ రా! నువ్వు యిదివరకు వాడితో కలిసి వర్క్ చేశావుటగా! ఫ్యామిలీతో కూడా పరిచయం వుందట..."
"..ఎప్పుడు! ఎలా!" తడారిపోయిన పెదవులతో అడిగాను.
"నెలరోజులయిందట. స్కూటర్ మీద వస్తూంటే యాక్సిడెంట్ అయిందట. పాపం. పిల్లలు చిన్నవాళ్ళేమో కదూ!"
నేను సమాధానం చెప్పలేదు. సీట్లోనుంచి లేచి మేనేజర్ రూంలోకి నడిచాను. లీవ్ లెటర్ యిచ్చి నేరుగా బస్ స్టాప్ కి వచ్చి బస్ ఎక్కాను.
".. ఊర్వశిని చూడాలి. ఊర్వశిని చూడాలి" మనసు కొట్టుకు పోతోంది.
బస్ కన్నా వేగంగా వెళ్ళి ఆమెముందు నిలవాలనిపిస్తోంది.
రవి పోయాడన్న విషయం కంటే ఊర్వశి ఎలావుందోనన్న ఆలోచన ఎక్కువ బాధ పెడ్తోంది.
వాడితోకన్నా ఆమెతోనే నాకు ఎక్కువ పరిచయం ఉన్నట్లూ.. ఎక్కువ అనుబంధం ఉన్నట్లూ.. ఎందుకిలా అనిపిస్తోంది!
బస్ దిగి, యింటిదాకా నడిచి, గేట్ తెరుస్తూంటే.. సరిగ్గా అపుడే ఊర్వశి యింట్లోనుంచి బయటకి వచ్చింది.
ఊర్వశి!
కొద్దిగా చిక్కిపోయింది. కానీ అప్పటి అందమేమీ తగ్గలేదు.
నాకు కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. రెండడుగులు ముందుకువేసి "ఊర్వశీ!" అన్నాను.
ఆమె కళ్ళలోనూ నీళ్ళు. "ఎపుడొచ్చారు కిరణ్!" వణికే గొంతుతో అడిగింది.
"ఇపుడే. ఈరోజే తెలిసింది నాకు."
లోపలికి నడిచి కుర్చీలో కూర్చున్నాను. ఆమె ఎదురుగా నిలబడింది. కాఫీ తెచ్చి యిచ్చింది. తాగాను.

పిల్లలిద్దరూ దగ్గరికి వచ్చారు. ముద్దుపెట్టుకుని వళ్ళో కూర్చోపెట్టుకున్నాను. వాళ్ళు మిస్ అయినది ఏమిటో తల్చుకుంటేనే గుండె బరువెక్కుతోంది.

ఎంత ప్రేమించేవాడు రవి వీళ్ళని! ఎవరు తీర్చగలుగుతారు వీళ్ళకాలోటు!

అప్పుడప్పుడూ వస్తూండాలి. వీలైనంతవరకూ వీళ్ళకి ఆలోటు తెలీకుండా చూడాలి. అనిపించింది.

ఇంకేమీ మాట్లాడలేదు ఊర్వశితో.

"ఎలా జరిగింది! ఏమిటి!" అని అడగాలని అనిపించలేదు.

ఆమె కూడా చెప్పలేదు.

"ఆయన ఉద్యోగం నాకిస్తారట. చేయాలనుకుంటున్నాను." అంది.

నేను చివ్వున తలెత్తాను.

ఆమెలో ఒకప్రక్కన చెప్పలేనంత దిగులూ.. వేదనా కనిపిస్తున్నాయి. కానీ వాటిని మించిన ధైర్యం కూడా కళ్ళనిండా పరుచుకుని వుంది.

ఇంకేమన్నా సహాయం కావాలేమోననిపించింది నాకు.

డబ్బేమన్నా కావాలంటే యివ్వగలిగిన స్టేజ్ లోనే వున్నాను నేను. అదేమాట చెప్పాను.

ఆమె కృతజ్ఞతగా చూసింది. "అలాంటి అవసరమేమీ లేదు కిరణ్! అంతా మాఅన్నయ్యే చూసుకున్నాడు. నాకు కనీసం లెక్కలు కూడా చెప్పలేదు." అంది.

నేను తల వూపాను. "ఉద్యోగంలో చేరగానే లెటర్ వ్రాయండి .. ఎపుడు ఏ సహాయం కావాలన్నా.. మీ అన్నయ్య యిచ్చేటంతటి ప్రేమనూ యివ్వగల స్నేహితుడు మీకున్నాడని మర్చిపోకండి" చెప్తూనే మొహం తిప్పుకున్నాను. కళ్ళలో నీళ్ళు కనపడకుండా కంట్రోల్ చేసుకోవడం కుదరలేదు.

ఊర్వశి గబుక్కున చేయిసాచి నాచేయి అందుకుంది.

నేనూ అలాగే పట్టుకున్నాను.

రెండు నిమిషాల మౌనం తర్వాత "వెళ్ళొస్తాను" అన్నాను.

బస్ ఎక్కి వచ్చేస్తూంటే నాకళ్ళు ధారాపాతంగా వర్షిస్తూనే వున్నాయి.

కళ్ళలోనుంచి నీళ్ళు కారిపోతుంటే మనసు మెల్లమెల్లగా తేలికయిపోతున్నట్లూ.. ప్రశాంతత వచ్చి చేరుతూన్నట్లూ అనిపించింది.

చాలారోజులుగా నేను కోల్పోయిన ప్రశాంతత!

రవి చనిపోయాడన్న బాధ కాదిది.

ఎందుకంటే వెళ్ళేటపుడు యిలాలేదు.

ఊర్వశిని చూశానన్న ఆనందమూ కాదు.

ఎందుకంటే ఊర్వశి.. ఊర్వశి అసలు నాకు కనపడలేదు.

అవును ఈ ఊర్వశి ఆ ఊర్వశి కాదు. ఇదివరకటి ఊర్వశి కాదు ఈమె. రవి ప్రక్కన నిలబడిన ఊర్వశి కాదు.

అదే రూపం. అదే అందం. కానీ ఈమె ఆమె కాదు. ఆ చిలిపితనం.. ఉట్టిపుణ్యానికి రవితో గిల్లికజ్జాలు పెట్టుకునే కొంటెతనం. కళ్ళలో వాడిమీద బోలెడంత అనురాగం.. వాళ్ళిద్దరికే తెలిసిన ఏవో రహస్య సంకేతాల సందోహం.

అవేమీ ఈమెలో లేవు.

ఈమెని చూస్తే ఒక్కటే భావం కలుగుతోంది. గౌ. ర. వం. అవును. ప్రేమతో కూడిన గౌరవం ఒక్కటే కలుగుతోంది.

నాకర్థమయింది. ఒక్కసారిగా నాకర్థమయింది.

ఇన్నాళ్ళూ ఊర్వశిలో నన్ను ఆకర్షించినదేమిటో నాకర్థమయింది.

ఆమె అందం కాదు.

స్త్రీత్వం కాదు.

రవిమీద ఆమెకున్న అనురాగం!

వాళ్ళిద్దరిమధ్యా వున్న ఆ అన్యోన్యత!

ఈరోజు ఊర్వశిని చూస్తే నాకెందుకు భయం వేయలేదో నాకిపుడు అర్థమయింది.

ఆమె చేయి పట్టుకోవడంలో నాకెందుకు సంకోచం కలగలేదో నాకు తెలుస్తోంది.

ప్రేమ తప్పు.. అణువణువునూ ఆనందింపచేసే అలౌకికమయిన ప్రేమ తప్పు.. తప్పు చేస్తున్నానన్న భావం నాకెందుకు రాలేదో నాకు.. ఈక్షణం అర్థమవుతోంది.

ఇన్నాళ్ళుగా నేననుభవించిన చిత్రవధ హటాత్తుగా నాకు దూరమయింది.

నీళ్ళు నిండిన కళ్ళు నా మనసులోని ఊర్వశి రూపాన్ని తన్మయంగా తొంగిచూశాయి.

పెదవులు ఊ.. ర్వ.. శీ.. అంటూ ఆత్మీయంగా ఉచ్చరించాయి.

*****